'శక్తి'కి నిధుల కటకట

- 5 నెలల్లోనే మూలన పడనున్న కాంగ్రెస్ గ్యారంటీ?!
- మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణమంటూ కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ ఆర్భాటపు హామీ
- ఏడాది కోసం రూ. 2,800 కోట్ల కేటాయింపు
- 5 నెలల్లోనే రూ. 2,143 కోట్లు ఖర్చైన వైనం
- నిధులు ఇవ్వకుంటే.. వచ్చే నెల ట్రిప్పులు డౌటే
- తప్పించుకొనేందుకు బస్సు సర్వీసుల రద్దు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంటూ కర్ణాటక కాంగ్రెస్ ఆర్భాటంగా ప్రకటించిన 'శక్తి' స్కీమ్‌కు నిధుల కటకట మొదలైంది. పథకం అమలు కోసం సిద్ధరామయ్య సర్కారు బడ్జెట్‌లో రూ. 2,800 కోట్లు కేటాయించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు ఈ నిధులను వినియోగించనున్నట్టు వెల్లడించింది. అయితే, అదివారం నాటికి 'శక్తి' స్కీమ్ కోసం ఉద్దేశించిన బడ్జెట్‌లో రూ.2,143 కోట్లు ఖర్చయినట్టు అధికారులు చెప్తున్నారు. మిగతా నిధులు వచ్చే డిసెంబర్ వరకు మాత్రమే సరిపోతాయని పేర్కొంటున్నారు. ప్రభుత్వం గనుక వెంటనే నిధులు విడుదల చేయకపోతే, బస్సులు నడుపడమే కష్టమని తేల్చి చెప్తున్నారు. దీనిపై స్పందించిన రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి డిసెంబర్‌లో మరిన్ని నిధులను కేటాయించేందుకు ప్రయత్నిస్తామన్నారు. అయితే, కచ్చితంగా విడుదల చేస్తామంటూ హామీని మాత్రం ఇవ్వలేకపోయారు. కాంగ్రెస్ సర్కారు ప్రకటించిన మిగతా నాలుగు గ్యారంటీలు కూడా అటకెక్కడం తెలిసిందే.

తప్పించుకొనేందుకు తంటాలు

'శక్తి' స్కీమ్ తీసుకువచ్చిన తర్వాత బస్సులో మహిళల ప్రయాణాలు తగ్గుతాయని కాంగ్రెస్ సర్కారు తప్పుగా అంచనా వేసింది. అయితే, అంచనాలకు మించి మహిళలు ఫ్రీ బస్సులను వినియోగిస్తుండటంతో డీజిల్ మోత మోగింది. దీంతో వ్యయ నివారణ చర్యలకు ప్రభుత్వం దిగింది. అనేక మార్గాల్లో బస్సు సర్వీసులను నడపడాన్ని నిలిపేసింది. గతంలో 5-10 నిమిషాలకు వచ్చే ఒక్కో బస్సు, ఇప్పుడు 40 నిమిషాలకు కూడా రావట్లేదని 'ది హిందూ' న్యూస్ పేపర్ ఇటీవల చేసిన సర్వేలో మహిళలు మండిపడ్డారు.

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

మేం ఊహించలేదు

'శక్తి' స్కీమ్ మొదలయ్యాక, బస్సులో ప్రయాణం చేసే మహిళల సంఖ్య తగ్గుతుందని అనుకొన్నాం. అయితే, మా అంచనా తప్పింది. ప్రభుత్వం కేటాయింపులను వెంటనే పెంచాలి. లేకపోతే, ఫ్రీ బస్సు సర్వీసులను నడపడం కష్టం.

– కర్ణాటక ఆర్టీసీ అధికారి

వైద్యుల కొరతపై కర్ణాటక హైకోర్టు సీరియస్

బెంగళూరు, నవంబర్ 7: కర్ణాటకలోని ప్రభుత్వ దవాఖానల్లో డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది కొరత తీవ్రస్థాయిలో ఉందంటూ వెలువడిన వార్త కథనాల్ని ఆ రాష్ట్ర హైకోర్టు సీరియస్‌గా తీసుకుంది. ఈ అంశంపై కర్ణాటక హైకోర్టు స్వయంగా కలుగజేసుకొని పిల్ (ప్రజా ప్రయోజన వ్యాజ్యం) దాఖలు చేయటం గమనార్హం. ప్రభుత్వ దవాఖానలు తీవ్రమైన సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నాయని, సుమారుగా 16,500 ఖాళీలు ఏర్పడ్డాయని అక్టోబర్ 16న దిన పత్రికల్లో వార్తా కథనాలు వెలువడ్డాయి. ఈ వార్తా కథనాల్ని పరిగణలోకి తీసుకొని 'పిల్' దాఖలు చేయాలంటూ హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రసన్న బి.వరాలె, జస్టిస్ క్రిష్ణ ఎస్.దీక్షిత్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు రిజిస్ట్రార్‌ను మంగళవారం ఆదేశించింది. ఈ అంశంపై హైకోర్టుకు సహకరించేందుకు అడ్వకేట్ శ్రీధర్ ప్రభును అమికస్ క్యూరీగా నియమించింది.

ఆప్ గెలవడానికి కారణం మా నాయకులే

గుజరాత్ బీజేపీ ఎంపీ సంచలన ఆరోపణలు

అహ్మదాబాద్: గుజరాత్ బీజేపీ అంతర్గత విభేదాలు బయటపడుతున్నాయి. సొంత పార్టీపై, ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ మన్‌సుఖ్ విమర్శలు ఎక్కుపెట్టారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో దిదియాపాద స్థానంలో ఆప్ అభ్యర్థి చైతార్ వాసవ గెలుపునకు బీజేపీ సీనియర్ నాయకులు సాయం చేశారని ఎంపీ మన్‌సుఖ్ వాసవ ఆరోపించారు. 'సీనియర్ బీజేపీ నాయకులు, నర్మదా జిల్లాలో కొంతమంది నాయకులు 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థికి అనుకూలంగా పనిచేశారు. బీజేపీ నాయకుల నుంచి ఆప్ ఎమ్మెల్యేకు ఇప్పటికీ మద్దతు అందుతున్నది. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాను' అని అన్నారు.

ఇండియా కూటమిలో మరో చిచ్చు

కాంగ్రెస్ వైఖరిని తప్పుబట్టిన ఒమర్ అబ్దుల్లా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ) : 'ఇండియా' కూటమిలో కాంగ్రెస్ వైఖరి పట్ల భాగస్వామ్య పక్షాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, బీహార్ సీఎం నితీశ్ కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేయగా, తాజాగా నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా కాంగ్రెస్ తీరును తప్పుబట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు ఉండదని కాంగ్రెస్ ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. కూటమి పక్షాల అవగాహన సార్వత్రిక ఎన్నికలకే పరిమితమా? అని ప్రశ్నించారు. ఈ ప్రశ్న కూటమి సమావేశమైనప్పుడు కూడా తలెత్తిందని గుర్తు చేశారు. అప్పుడు కాంగ్రెస్ సమాధానం చెప్పకపోవడం వల్లే మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కూటమి పక్షాలు పోట్లాడుకునే పరిస్థితి ఏర్పడిందని ఒమర్ విమర్శించారు.

'హరిగఢ్'గా మారనున్న అలీగఢ్!

అలీగఢ్: ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం మరో పేరు మార్పునకు సిద్ధమైంది. అలీగఢ్ పేరును 'హరిగఢ్'గా మార్చనున్నది. ఈ మేరకు అలీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ సోమవారం ఓ తీర్మానాన్ని ఆమోదించి, సంబంధిత ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. నగరం పేరు మార్చాలనే డిమాండ్ దీర్ఘకాలంగా ఉన్నదని మేయర్ ప్రశాంత్ సింఘాల్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని యోగి ప్రభుత్వం గతంలో అలహాబాద్‌ను ప్రయాగ్‌రాజ్‌గా, ఫైజాబాద్ జిల్లాను అయోధ్య జిల్లా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

నోబెల్ శాంతి విజేత జైల్లో నిరాహార దీక్ష

టెహ్రాన్: ఇరాన్‌కు చెందిన మహిళల హక్కుల కార్యకర్త, నోబెల్ శాంతి బహుమతి విజేత నర్గెస్ మొహమ్మది సోమవారం జైల్లోనే నిరాహార దీక్ష ప్రారంభించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనను దవాఖానకు తీసుకెళ్లేందుకు అధికారులు నిరాకరించడంతో పాటు కఠిన హిజాబ్ నిబంధనలకు వ్యతిరేకంగా దీక్ష చేపట్టారు. హిజాబ్ ధరించలేదని గుండె, ఊపిరితిత్తుల సంబంధిత చికిత్స కోసం దవాఖానకు తరలించేందుకు అధికారులు అనుమతించలేదని హెచ్‌ఆర్‌ఏఎన్‌ఏ పేర్కొన్నది.

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో ఓటు వేయడానికి బారులుతీరిన ప్రజలు

ఛత్తీస్‌గఢ్‌లో 71.. మిజోరంలో 77 శాతం

- ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ కాల్పులు, ఎల్ఈడీ పేలుడు
- మిజోరంలో ప్రశాంతంగా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్

రాయ్‌పూర్, ఐజ్వాల్, నవంబర్ 7: ఎదురుకాల్పులు, మందుపాతర పేలుడు వంటి హింసాత్మక ఘటనల మధ్య ఛత్తీస్‌గఢ్‌లో మొదటి విడత అసెంబ్లీ ఎన్నికలు ఉద్రిక్తతంగా ముగిశాయి. మరోవైపు మిజోరంలోని 40 స్థానాలకు ఒకే విడతలో జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఛత్తీస్‌గఢ్‌లో 71 శాతం, మిజోరంలో 77 శాతం ఓటింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికలను అడ్డుకునేందుకు మావోయిస్టులు ప్రయత్నించారు. నక్సల్స్-భద్రతా బలగాల మధ్య ఆరు చోట్ల దాడి ఘటనలు చోటు చేసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. సుక్మా జిల్లా తొండమర్కా ప్రాంతంలో ఉదయం మావోయిస్టులు జరిపిన ఎల్ఈడీ పేలుడులో సీఆర్‌పీఎఫ్ కోబ్రా యూనిట్‌కు చెందిన ఒక జవాన్ గాయపడ్డారు. నారాయణపూర్, బీజాపూర్, కన్‌కేర్ జిల్లాల్లో ఎదురు కాల్పులు జరిగాయి. ఇందులో భద్రతా దళాలకు చెందిన వారెవ్వరూ గాయపడలేదు.

సీఎం ఓటు వేస్తుండగా మొరాయించిన ఈవీఎం

మిజోరంలోని ఐజ్వాల్‌లో సీఎం జోరంతంగా ఓటు వేస్తుండగా ఈవీఎం మొరాయించడంతో ఓటు వేయలేకపోయారు. కొంతసేపటికి తిరిగొచ్చిన ఆయన తన ఓటు హక్కును వినియోగించుకొన్నారు.

కూలీలకు 'చెయ్యి'చ్చిన రాజస్థాన్ కాంగ్రెస్ నేత

- నామినేషన్ ర్యాలీ కోసం అడ్డా కూలీలు
- రూ.500 ఇస్తామని ఆశపెట్టిన హస్తం నేతలు
- మొండి చెయ్యి చూపడంతో పోలీసులకు ఫిర్యాదు

పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన కూలీలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): రోజు గడవడం కోసం కష్టపడే శ్రమ జీవులను కాంగ్రెస్ నేతలు నిండా ముంచారు. కుటుంబ పోషణ కోసం ఎదురు చూస్తున్న అడ్డా కూలీలను వాడుకుని నిర్దాక్షిణ్యంగా వదిలేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజస్థాన్ మంత్రి, కాంగ్రెస్ నేత శాంతి ధారివాల్ నామినేషన్ సందర్భంగా ఈ సంఘటన జరిగింది. రాజేశ్ సమారియా అనే కూలీ తెలిపిన వివరాల ప్రకారం, ఇటీవల శాంతి ధారివాల్ అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేయడం కోసం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు కొందరు అడ్డా కూలీలను బస్సులో తీసుకెళ్లారు. రోజుకు రూ.500 చొప్పున ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఈ అడ్డా కూలీలను బస్టాండ్ వద్ద వేచి ఉండమని ధారివాల్ అనుచరులు చెప్పారు. 39 మంది కూలీలు డబ్బుల కోసం సాయంత్రం వరకు ఎదురు చూశారు. తమకు డబ్బులిచ్చేందుకు కాంగ్రెస్ నాయకులెవరూ రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆ తర్వాత కాస్త ధైర్యం తెచ్చుకుని మంగళవారం దాదాబాడి జిల్లా, కోటా పోలీసులను ఆశ్రయించారు. తమకు రోజుకు రూ.500 చొప్పున ఇస్తామని కాంగ్రెస్ నేత మనీష్ తివారీ చెప్పారని, సాయంత్రం వరకు ఎదురు చూసిన తర్వాత ఆయనకు ఫోన్ చేస్తే, తమకే డబ్బులు రాలేదని ఆయన సమాధానం చెప్పారని తెలిపారు. తమకు డబ్బులిప్పించాలని ఫిర్యాదులో కోరారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కూలి పనికి వెళ్లకపోవడంతో తమకు జీవనాధారం పోయిందని కూలీలు వాపోయారు.

బీజేపీ, కాంగ్రెస్ మోసకారి పార్టీలు

మమ్మల్ని దగా చేశాయ్..ఛత్తీస్‌గఢ్ గిరిజనుల ఆవేదన

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌ను 2018కి ముందు 15 ఏండ్ల పాటు పాలించిన బీజేపీ, 2018 తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తమను మోసగించాయని స్థానిక ఆదివాసీ నేతలు చెబుతున్నారు. మావోయిస్టు వ్యతిరేక వ్యూహాల ముసుగులో స్థానిక గిరిజనులపై హింస, కేసులు పెట్టడం, పెద్దయెత్తున సెక్యూరిటీ క్యాంపులు ఏర్పాటు చేయడం వంటి చర్యలకు పాల్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో మైదాన ప్రాంతాల్లోని ప్రజలకు ఉన్నట్టుగా ఇక్కడ పథకాలు కూడా ఉండవని ఓ రాజకీయ కార్యకర్త పేర్కొన్నారు. 2018 ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేక సెంటిమెంట్‌తో కాంగ్రెస్ గెలిచింది. గిరిజన వ్యతిరేక విధానాలతో 2018 ఎన్నికల్లో బస్తర్ రీజియన్‌లోని 12 నియోజకవర్గాలకుగానూ 11 స్థానాల్లో కమలం పార్టీ పరాభవం మూటకట్టుకోగా, తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఉన్న ఒక్క స్థానంలోనూ ఓటమి చవిచూసింది. అయితే తర్వాత వచ్చిన కాంగ్రెస్ కూడా తమ పట్ల అదే విధంగా వ్యవహరించిందని సర్వ ఆదివాసీ సమాజ్ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. ప్రతి విషయంలోనూ కాంగ్రెస్ సర్కార్ తమను మోసగించిందని, మావోయిస్టులతో వ్యవహరించే విషయంలో బీజేపీ సర్కార్ తీసుకొన్నట్టుగానే నిర్ణయాలు తీసుకొన్నదన్నారు.

'ఈడీ.. బీజేపీ స్టార్ క్యాంపెయినర్'

గ్వాలియర్, నవంబర్ 7: ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా బీజేపీకి స్టార్ క్యాంపెయినర్ (ప్రధాన ప్రచారకర్త) అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు. ఇక కేంద్ర సంస్థలు సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) కూడా బీజేపీ తరపున పోరాటంలో భాగస్వాములేనని విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఒకరే పోటీ చేస్తుండగా, బీజేపీ మాత్రం నలుగురితో రంగంలో దిగుతున్నదని విమర్శించారు. అందులో ఒకరు భౌతికంగా మనకు కన్పించే బీజేపీ అభ్యర్థి కాగా, మన కంటికి కన్పించకుండా అతని వెనుక స్టార్ క్యాంపెయినర్ ఈడీతో పాటు సీబీఐ, ఐటీ శాఖలు ఉంటున్నాయని ఖర్గే పేర్కొన్నారు. ఈ మూడే కాక, ప్రధాని మోదీ, మధ్యప్రదేశ్ ఎంపీ చౌహాన్ కూడా తోడై పంచ పాండవుల్లా కాంగ్రెస్‌ను ఓడించడానికి ప్రయత్నిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. అయితే వీరందరికీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తగిన విధంగా బుద్ధి చెబుతుందని అన్నారు.

పదే పదే వాయిదా ఎందుకు?

అదానీ కేసుపై ప్రశాంత్ భూషణ్ ఆందోళన

న్యూఢిల్లీ, నవంబర్ 7: అదానీ కేసుకు సంబంధించి తాము వేసిన పిటిషన్లు కనీసం లిస్టింగ్ కాకపోవడంపై పిటిషనర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త అదానీకి సంబంధించిన హిండెన్‌బర్గ్ ఉదంతంపై సుప్రీం కోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఆగస్టు 28న విచారణ జరగాల్సి ఉండగా, రెండు నెలలైనా కనీసం కేసులు లిస్టింగ్ కాలేదు. దీంతో ఒక పిటిషనర్ తరపున సుప్రీం కోర్టులో హాజరైన ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు. కేసు లిస్టింగ్ కాకుండా పదేపదే వాయిదా పడుతున్న విషయాన్ని ప్రస్తావించారు.దీనిపై స్పందించిన సీజేఐ చంద్రచూడ్ దీనిపై రిజిస్ట్రీని అడుగుతానని చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు క్లుప్తంగా పరిశీలిస్తే ఆదానీ సంస్థలు పలు ఆర్థిక అవకవకలకు పాల్పడినట్టు అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ ఒక నివేదిక విడుదల చేసింది. దానిని అదానీ గ్రూపు తిరస్కరించింది.

తక్షణం కాలుష్యం ఆగాలి

- పంట వ్యర్థాల దహనాన్ని ఆపండి
- పంజాబ్, యూపీ, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం
- ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై ఆందోళన

మంగళవారం పంజాబ్‌లోని పాటియాలాలో కొయ్యకాళ్ల దగ్ధం

న్యూఢిల్లీ, నవంబర్ 7: దేశ రాజధాని ఢిల్లీ-ఎన్సీఆర్ పరిధిలో రోజురోజుకు పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు మంగళవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. క్షీణిస్తున్న గాలి నాణ్యత ప్రజల ఆరోగ్యాన్ని ఖూనీ చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేసింది. కాలుష్యానికి ప్రధాన కారణంగా ఉన్న పంట వ్యర్థాల దహనాన్ని వెంటనే ఆపాలని ఢిల్లీ పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలను జస్టిస్ ఎస్కే కౌల్, జస్టిస్ సుధాంశ్ ధులియా ధర్మాసనం ఆదేశించింది. 'వెంటనే ఇది ఆగాలి. అందుకు మీరు ఏం చేస్తారో మాకు తెలియదు. పంట వ్యర్థాల దహనాన్ని ఆపడం మీ విధి' అని పేర్కొన్నది.

ఏం చర్యలు తీసుకొన్నారు?

కాలుష్యంపై ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సర్వోన్నత న్యాయస్థానం.. అన్ని సమయాల్లో రాజకీయ యుద్ధం ఉండకూడదని సూచించింది. 'ఈ పంట వ్యర్థాల దహనం ఆగడం లేదు. దీన్ని ఆపేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చర్యలు తీసుకొన్నాయి' అని ప్రశ్నించింది. కాలుష్యం కారణంగా ప్రజలు చనిపోనివ్వకూడదని అభిప్రాయపడింది. ఏండ్లుగా కాలుష్య సమస్య ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు పరిష్కారాన్ని గుర్తించలేదని ప్రభుత్వాల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. విచారణ సందర్భంగా ఢిల్లీ ప్రభుత్వానికి కూడా సుప్రీంకోర్టు పలు కీలకమైన సూచనలు చేసింది. మున్సిపాలిటీ పరిధిలో ఘన వ్యర్థాలను బహిరంగంగా తగులబెట్టడాన్ని నియంత్రించాలని సూచించింది.

స్థానిక కాలుష్యమే ప్రధాన కారణం!

పంట వ్యర్థాల దహనం ఒక్కటే ఢిల్లీలో ఈ ఏడాది కాలుష్య పెరుగుదలకు కారణం కాదని తాజా నివేదిక పేర్కొన్నది. స్థానికంగా వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు వంటి స్థానిక అంశాలు ఇప్పటికే ఢిల్లీ గాలిని విషపూరితం చేశాయని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్ఈ) తెలిపింది. ఈ ఏడాది పంట వ్యర్థాల దహనం గతం కంటే తగ్గిందని, ఢిల్లీ పీఎం 2.5 స్థాయిల్లో ఇది దాదాపు 25 శాతంగా మాత్రమే ఉన్నదని సీఎస్ఈ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుమిత రాయ్ పేర్కొన్నారు.

'జర్నలిస్టుల ఫోన్ల తనిఖీకి మార్గదర్శకాలు అవసరం'

న్యూఢిల్లీ: వ్యక్తుల ఫోన్లు, డిజిటల్ డివైస్‌లను తనిఖీ చేసి, స్వాధీనం చేసుకోవడానికి మార్గదర్శకాలు అవసరమని సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి చెప్పింది. మీడియా ప్రొఫెషనల్స్ కోసం ఇవి అవసరమని చెప్పింది. జర్నలిస్టుల పరికరాల్లో విశ్వసనీయ వర్గాల నుంచి సేకరించిన సమాచారం, వివరాలు ఉంటాయని తెలిపింది. జర్నలిస్టులను విచారించేందుకు, వారి ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌ల వంటివి స్వాధీనం చేసుకొనేందుకు ప్రత్యేక విధి విధానాలు రూపొందించాలని ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెషనల్స్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

నిషేధిత రసాయనాలున్న పటాకులపై దేశమంతా నిషేధం

న్యూఢిల్లీ : నిషేధిత రసాయనాలతో తయారైన పటాకులను కాల్చడాన్ని నిషేధిస్తూ తామిచ్చిన ఉత్తర్వులు ఢిల్లీకి మాత్రమే కాదు దేశమంతా వర్తిస్తాయని సుప్రీంకోర్టు తాజాగా పేర్కొన్నది. అత్యున్నత న్యాయస్థానం ఇంతక్రితం జారీ చేసిన ఉత్తర్వులు రాజస్థాన్ సహా దేశంలోని అన్ని రాష్ట్రాలు అమలు జేయాలని స్పష్టం చేసింది. 'వాయు, ధ్వని కాలుష్యాన్ని నియంత్రించే బాధ్యత అందరిదీ. పర్యావరణ పరిరక్షణ అన్నది కేవలం కోర్టుల బాధ్యత కాదు' అని జస్టిస్ సుందరేశ్ అన్నారు.

'పని ప్రదేశంలో లైంగిక వేధింపులను తీవ్రంగా పరిగణించాలి'

న్యూఢిల్లీ : పని ప్రదేశంలో లైంగిక వేధింపులు ఏ రూపంలో ఉన్నా దానిని తీవ్రంగా పరిగణించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన అధికారికి పెన్షన్‌లో 50 శాతం కోత విధించాలంటూ సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) తీసుకున్న నిర్ణయాన్ని కొట్టివేస్తూ గువహాటి హైకోర్టు ఇచ్చిన తీర్పును తప్పుబట్టింది. లైంగిక వేధింపుల అంశాన్ని తేలికగా తీసుకోరాదని పేర్కొంటూ వేధింపులకు పాల్పడిన నిందితునికి జరిమానా కొనసాగించాలని ధర్మాసనం తీర్పు చెప్పింది.

స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'ప్రళయ్' విజయవంతంగా లక్ష్యాన్ని ఛేదించింది. మంగళవారం ఉదయం ఒడిశా తీరంలోని అబ్దుల్ కలాం దీవి నుంచి చేపట్టిన ప్రయోగ పరీక్షల్లో ప్రళయ్ అద్భుతమైన ప్రదర్శన చూపిందని, మిషన్ సక్సెస్ అయ్యిందని భారత రక్షణ శాఖ వర్గాలు ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. సరిహద్దులో చైనా, పాకిస్థాన్ నుంచి ఎదురవుతున్న సవాళ్లను దృష్టిలో పెట్టుకొని ఈ మిస్సైల్‌ను డీఆర్‌డీవో అభివృద్ధి చేసింది.

డీప్‌ఫేక్ అడ్డుకోవాల్సిన బాధ్యత మీదే!

సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం అడ్వైజరీ

మోసపూరిత వీడియోలు తీస్తే మూడేండ్ల జైలు, రూ.లక్ష జరిమానా

మార్ఫింగ్‌కు ముందు.. తర్వాత

న్యూఢిల్లీ : సినీ నటి రష్మిక మందన్నా డీప్‌ఫేక్ వీడియో వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. టెక్నాలజీ దుర్వినియోగంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో ఈ తరహా వీడియోలను అడ్డుకోవటంపై కేంద్ర ఐటీ శాఖ మంగళవారం స్పందించింది. ఇలాంటి వీడియోలను అడ్డుకోవాల్సిన బాధ్యత సోషల్ మీడియా సంస్థలదేనని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి సోషల్ మీడియా కంపెనీలకు ఒక అడ్వయిజరీని జారీ చేసింది.కృత్రిమ మేధ (ఏఐ)తో కంటెంట్‌ను తయారుచేస్తూ తప్పుదోవ పట్టిస్తున్న వాటిపై 24 గంటల్లోగా చర్యలు చేపట్టాలని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్..తదితర సోషల్ మీడియా సంస్థలకు సూచించింది. ఐటీ చట్టం-2000 సెక్షన్ 66-డీ కింద చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు అవకాశముందని తెలిపింది. కంప్యూటర్ సాంకేతికతను ఉపయోగించి వ్యక్తుల్ని మోసగిస్తే ఈ సెక్షన్ కింద రూ.లక్ష వరకు జరిమానా, మూడేండ్ల జైలు శిక్ష విధించే అవకాశముందని అడ్వైయిజరీలో కేంద్రం గుర్తు చేసింది. ఐటీ నిబంధనావళిలో రూల్ 3(2)(బీ)ను ఉపయోగించి తప్పుడు వీడియోలను, కంటెంట్‌ను తొలగించవచ్చునని తెలిపింది. ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా మార్ఫింగ్ వీడియోలు, ఫొటోలపై చర్యలు చేపట్టాలని పేర్కొన్నది. డీప్‌ఫేక్ వీడియోపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ డిమాండ్ చేశారు. మార్ఫింగ్ వీడియో తననెంతో భయానికి గురిచేసిందని నటి రష్మిక మందన్నా ఆందోళన వ్యక్తం చేశారు.

అమిత్ షాకు త్రుటిలో తప్పిన ప్రమాదం

న్యూఢిల్లీ : కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం త్రుటిలో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. రాజస్థాన్ శాసన సభ ఎన్నికల్లో బీజేపీ తరపున ప్రచారం చేయడం కోసం ఆయన నాగౌర్‌లో పర్యటించారు. ఆయన ప్రయాణిస్తున్న ప్రచార రథంపై భాగం ఓ విద్యుత్తు వైరుకు తగిలింది. వెంటనే నిప్పు రవ్వలు ఎగిసపడి, ఆ వైరు తెగిపోయింది. బిదియాద్ గ్రామం నుంచి పర్బత్సర్‌కు వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది.

ఖలిస్థానీల బెదిరింపులతో విమానాశ్రయాల్లో తనిఖీలు

న్యూఢిల్లీ: ఎయిరిండియా విమానాలలో అదనపు భద్రతా తనిఖీలను నిర్వహించాలని బీసీఏఎస్ మంగళవారం ఆదేశించింది. ఖలిస్థానీ ఉగ్రవాద సంస్థ ఎస్ఎఫ్‌జే బెదిరింపుల నేపథ్యంలో పంజాబ్, న్యూఢిల్లీలలోని విమానాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించింది.